నమస్తే తెలంగాణ
కామారెడ్డి
10 | నిజామాబాద్, శనివారం 10 మే 2025 | KAMAREDDY



గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్లు



అడవిమామిడిపల్లి గ్రామ ముఖచిత్రం



- జవాన్ల గ్రామంగా పేరు తెచ్చుకున్న అడవిమామిడిపల్లి
- దేశ సేవలో తరించిన 14 మంది యువకులు
- ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల వేళ కుటుంబీకుల్లో భావోద్వేగం
- పాకిస్థాన్‌తో పోరులో భారత్‌దే పైచేయి నిలుస్తోందంటున్న సైనికులు
- జవాన్ల స్ఫూర్తితో పోలీస్, ఇతర ఉద్యోగాలు సాధించిన యువకులు

# మాతృభూమి రక్షణలో మామిడిపల్లి

నిజామాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / మాక్లూర్: మాతృభూమి రక్షణలో ఆ గ్రామం తరిస్తున్నది. దేశ సేవ కోసం గ్రామంలోని యువత అంకితమవుతున్నది. జవాన్ల గ్రామంగా పేరుతెచ్చుకొని ఆదర్శ పల్లెగా నిలుస్తున్నది నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి గ్రామం. జాతీయ రహదారి వెంట ఉన్న మామిడిపల్లిలో 20 ఏండ్లలో ఇప్పటి వరకు 14 మంది ఆర్మీ ఉద్యోగాల్లో రాణించారు. జవాన్‌గా ఎంపికై వివిధ హోదాల్లో దేశ సేవలో తరించారు. కొంత మంది సర్వీస్ పూర్తి చేసుకుని ఇంటి రాగా, మరికొంత మంది ఇప్పటికీ దేశ సేవలో ఉన్నారు. ఆర్మీ ఉద్యోగాలంటే ఈ ప్రాంతంలో ఎంతో ఆసక్తి చూపుతుంటారు. చాలా మంది ఇంటర్ అయిపోగానే సంప్రదాయబద్ధంగా డిగ్రీలు, పీజీలు లేదంటే ఇంజినీరింగ్ చదువుతారు. కానీ ఈ ప్రాంత యువకులు చాలా భిన్నం. యుక్త వయసులో ఆర్మీ ఉద్యోగాల కోసం పోటీపడడం వీరి నైజం. జవాన్‌గా దేశ సేవలో నిమగ్నమైన ఎంతో మందిని స్ఫూర్తిగా తీసుకుని మామిడిపల్లిలో పోలీస్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను సైతం చాలా మంది సాధించారు. ప్రభుత్వ సేవల్లో భాగమై ప్రజలకు సేవలు అందిస్తున్నారు. పాకిస్థాన్, భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో ఈ ప్రాంతంలోని మాజీ సైనికులు భావోద్వేగానికి గురవుతున్నారు. ఈ పోరులో భారత్‌దే పైచేయి అంటూ గర్వంగా చెబుతున్నారు. పాకిస్థాన్ పీచమణిచే సమయం ఆసన్నమైందంటున్నారు. భారత్‌తో పోరుకు సిద్ధమైన పాకిస్థాన్‌కు సరైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు.

## దేశమంటే ప్రేమ..

ప్రాణాలు పణంగా పెట్టి సరిహద్దులో పహారా కాసే జవాన్లుగా ప్రత్యక్షంగా దేశ సేవ చేస్తూ తమ ఊరికే కాక జిల్లాకే గర్వకారణంగా నిలుస్తున్నారు మామిడిపల్లి గ్రామ యువకులు. అడవి మామిడిపల్లి నుంచి 21 ఏండ్లలో సగటున ఏడాదికొకరు చొప్పున 14 మంది యువకులు ఆర్మీ, ఐటీబీపీ దళాల్లోకి వెళ్లారు. మొత్తం ఉత్తర తెలంగాణలోనే ఈ ఊరి ప్రత్యేకతను చాటుతున్నారు. ఈ గ్రామాన్ని అడవి మామిడిపల్లి అని కాకుండా జైహింద్ మామిడిపల్లి, ఆర్మీ మామిడిపల్లి అని పిలుస్తుండడం విశేషం. ఇక ఊరిలోకి అడుగు పెట్టగానే స్వామివివేకానంద విగ్రహం, ఊరి మధ్యలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలు దర్శనమిస్తాయి. దేశ భక్తి స్ఫూర్తిగా విగ్రహాలు నెలకొల్పడంతోపాటు తమ బిడ్డలకు దేశరక్షణ కోసం సరిహద్దుల్లో పహారాకు పంపుతున్న ఆ ఊరి తల్లిదండ్రులకు పాదాభివందనం చేయాలని పలువురు చెబుతుండడం అతిశయోక్తి కాదు.



## ఎంతో మందికి ఆదర్శం

మామిడిపల్లి గ్రామం ఇప్పుడు ఎంతో మంది స్ఫూర్తి కేంద్రంగా మారింది. సాధారణంగా ఇంటర్, డిగ్రీ చదివే సమయంలో సినిమాలు, షికార్లు అంటూ టైం పాస్ చేయడం చూస్తుంటాం. ఈ గ్రామంలో ఆర్మీ ఉద్యోగానికి అర్హత వస్తే దరఖాస్తు చేసి పరీక్షలకు సన్నద్ధమవుతారు. ఆర్మీలో చేరేందుకే ఎక్కువ మంది పోటీ పడుతారు. వివిధ కారణాలతో ఆర్మీలో జాబ్ చేజారితే కనీసం పోలీస్ ఉద్యోగాలకు పోటీ పడడం ఇక్కడ కనిపిస్తుంది. ఈ గ్రామంలో పదుల సంఖ్యలో పోలీస్ శాఖలో ఉద్యోగాలు సంపాదించిన వారున్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్న వారితో కలిపి మొత్తం 50 మంది వరకు ఉండడంతో ఈ గ్రామం ఆదర్శంగా నిలిచింది. వివేకానందుడు, అంబేద్కర్ సిద్ధాంతాలను పాటిస్తూ, వారు చూపిన మార్గంలో నడుస్తున్నది.

### పాకిస్థాన్‌కు సరైన గుణపాఠం తప్పదు..



పాకిస్థాన్‌పై భారత్ కొనసాగిస్తున్న ఈ పోరులో ముమ్మాటికి మనదే పైచేయి ఉంటుంది. శక్తియుక్తుల్లో పాకిస్థాన్‌కు ఎలాంటి బలాలు లేవు. మేకపోతుగాంభీర్యం ప్రదర్శిస్తున్నది. జమ్ములో అనేక గడ్డు పరిస్థితులను నేను స్వయంగా ఎదుర్కొన్నాను. జవాన్ నుంచి హవల్దార్ వరకు పని చేశాను. నేను పని చేసిన సమయంలో నిత్యం ఘర్షణ పూరిత వాతావరణం ఉండేది. చాలా దీటుగా ఎదుర్కొనేవాళ్లు.

\- వంజరి రవీందర్, ఆర్మీ మాజీ జవాన్, మామిడిపల్లి

### రోజుల్లోనే పాకిస్థాన్ కథ ముగుస్తుంది...



దేశ సేవలో ప్రాణాలకు తెగించి కొట్లాడడం మాటలు కాదు. జవాన్ నుంచి వివిధ హోదాల్లో, వివిధ సందర్భాల్లో పోరాటం చేసే అవకాశం నాకు దక్కడం గర్వంగా ఉంటుంది. పంజాబ్, అస్సాం, జమ్ముకశ్మీర్, ఢిల్లీ, హైదరాబాద్‌లో జవాన్‌గా పనిచేశాను. కశ్మీర్‌లో పని చేసిన రోజులను మరిచి పోలేను. పాకిస్థాన్‌తో ఇప్పుడు జరుగుతున్న ఉద్రిక్త పరిస్థితుల్లో రోజుల వ్యవధిలోనే భారత్ విజయం సాధిస్తుంది. పాకిస్థాన్‌కు భారత్‌తో ఢీకొనే శక్తి లేదు.

\- జానకీరామ్, ఆర్మీ మాజీ జవాన్, మామిడిపల్లి

### మన దేశంతో తలపడాలంటే వణికి పోవాల్సిందే...



పాకిస్థాన్‌కు సరైన జవాబు ఇచ్చే ఏకైక దేశం భారత్ మాత్రమే. ఇంకోసారి మన దేశంతో తలపడాలంటే వణికి పోయే పరిస్థితిని పాకిస్థాన్ ఎదుర్కొంటుంది. నేను సుదీర్ఘ కాలం పంజాబ్, రాజస్థాన్, నాగాలాండ్, జమ్ము, అస్సాం, ఢిల్లీ, సికింద్రాబాద్‌లో పని చేశాను. సిపాయిగా ఎంపికై లాన్స్ నాయక్, నాయక్‌గా ఉద్యోగోన్నతి పొందాను. హవల్దార్‌గా పని చేసిన.

\- కేతావత్ రవీందర్, ఆర్మీ మాజీ జవాన్, మామిడిపల్లి



శ్రీధర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు, శ్రీధర్ (ఫైల్)

# శ్రీధర్‌కు కన్నీటి వీడ్కోలు

- కూంబింగ్ నిర్వహిస్తుండగా మందుపాతర పేలి మృతి
- స్వగ్రామం పాల్వంచలో ముగిసిన అంత్యక్రియలు
- పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ

కామారెడ్డి, మే 9 : ములుగు జిల్లా వాజేడులో ఆపరేషన్ కగార్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో మందుపాతర పేలుడులో కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల కేంద్రానికి చెందిన వడ్ల శ్రీధర్ (30) మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా స్వగ్రామం పాల్వంచలో శుక్రవారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. శ్రీధర్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. విధి నిర్వహణలో మరణించిన పోలీసు వడ్ల శ్రీధర్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని, హింసా మార్గాన్ని విడనాడాలని సూచించారు. శ్రీధర్ కుటుంబానికి రూ. 2.17 కోట్ల ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి అందజేస్తామని తెలిపారు. అంత్యక్రియల్లో ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర, గ్రేహౌండ్ కమాండర్ ఆపరేషన్ రాఘవేందర్ రెడ్డి, ఓఎస్డీ దయానంద్, అదనపు ఎస్పీ చైతన్యారెడ్డి, డీఎస్పీ శంకరయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, పోలీసు, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్రీధర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి, ప్రభుత్వ సలహాదారు

# అనర్హులకే ఇందిరమ్మ ఇండ్లు..



పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

## వదల్‌పర్తి జీపీ వద్ద గ్రామస్తుల ఆందోళన

ఎల్లారెడ్డి రూరల్ (నాగిరెడ్డిపేట), మే 9: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అనర్హులను ఎంపిక చేశారని నాగిరెడ్డిపేట మండలంలోని వదల్‌పర్తిలో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హులని కాదని, కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని ఎంపిక చేశారని పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వారిని ఎంపికచేశారని ఆరోపించారు. విచారణ చేపట్టి అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొదటి విడుతలో అర్హులైన వారికి ఎంపిక చేయాలని సూచిస్తుంటే గ్రామాల్లో మాత్రం ఇష్టానుసారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని మండిపడ్డారు. ఎంపికైన వారిలో అందరూ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవారే అని తెలిపారు. గ్రామస్తులు ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వారిని సముదాయించారు.అధికారులకు ఫిర్యా దు చేస్తే విచారణ చేపట్టి అనర్హులను తొలగిస్తారని సూచించడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

# ‘భూభారతి’ దరఖాస్తులపై క్షుణ్ణంగా విచారణ చేపట్టాలి

**నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఆర్మూర్ టౌన్, మే 9 : భూభారతి చట్టం కింద రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులపై క్షుణ్ణంగా విచారణ చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి, భూభారతి దరఖాస్తుల విచారణపై పలు సూచనలు చేశారు. ఈ నెల 12 నుంచి దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఎట్టి పరిస్థితుల్లో ఈ నెల 20వ తేదీ లోగా పూర్తి కావాలని గడువు విధించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# భారత సైనికులకు అండగా నిలుద్దాం..

**సినీ నటి పూనమ్ కౌర్**



కార్యక్రమంలో మాట్లాడుతున్న పూనమ్‌కౌర్

ఖలీల్‌వాడి, మే 9 : భారత్, పాకిస్థాన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధంలో భారత సైనికులకు అండగా నిలుద్దామని సినీ నటి పూనమ్ కౌర్ అన్నారు. శాంతి ప్రచారం కార్యక్రమంలో భాగంగా ఆమె శుక్రవారం జిల్లాకు వచ్చారు. నగరంలోని నాందేవ్‌వాడ బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి మాట్లాడారు. ఓపిక, సహనంతోనే పనిచేస్తే ఏదైనా సాధ్యమన్నారు. సహనంతో ఉంటూ సైనిక దళాలకు మద్దతు తెలుపుదామని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులు జమ్ముకశ్మీర్‌లో అమాయక భారతీయులను పొట్టన పెట్టుకోవడం బాధాకరమన్నారు. ఉగ్రవాదులను అంతం చేయడానికి భారత సైనికులు తమ ప్రాణాలు లెక్క చేయకుండా యుద్ధంలో పోరాడుతున్నారని తెలిపారు. భారత సైనికులకు సెల్యూట్ చేస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి ఐశ్వర్య, నాందేవ్‌వాడ సెంటర్ నిర్వాహకురాలు సునీత బహేంజీ, జ్యోతి బహేంజీ, శ్రీనివాస్‌కుమార్ పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# క్షేత్రస్థాయిలో పర్యటించాలి..

**కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

లింగంపేట, మే 9: భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల అధారంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి, విచారణ చేపట్టాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్.. అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేసి లింగంపేటను పైలట్ మండలంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో 4,225 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన కోసం తొమ్మిది ప్రత్యేక బృందాలతో గ్రామాల్లో విచారణ చేపడుతున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు 1,443 దరఖాస్తుల విచారణ పూర్తయ్యిందని, మిగతా వాటిని త్వరితగతిన విచారణ చేపట్టాలన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమస్యాత్మకంగా ఉన్న భూములను సంయుక్తంగా సర్వే నిర్వహించాలని సూచించారు. దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ (రెవెన్యూ), బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, భూ భారతి ప్రత్యేకాధికారి రాజేందర్, ల్యాండ్ సర్వే సహాయ సంచాలకుడు శ్రీనివాస్, అటవీ అభివృద్ధి అధికారి రామకృష్ణ, ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ సురేశ్‌తో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



నీటిమట్టం తగ్గడంతో బోసిపోయిన ఎస్సారెస్పీ

# ఎస్సారెస్పీలో తగ్గుతున్న నీటిమట్టం

## కొనసాగుతున్న స్వల్ప ఇన్‌ఫ్లో

మోర్తాడ్, మే 9 : నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో రోజురోజుకూ నీటిమట్టం తగ్గుతున్నది. యాసంగి పంటలకు ప్రధాన కాలువలైన కాకతీయ, సరస్వతీ, లక్ష్మి వరదకాలువలతో పాటు ఎత్తిపోతలకు ప్రణాళిక ప్రకారం అధికారులు నీటిని విడుదల చేశారు. అనుకున్న ప్రకారం యాసంగి పంటలకు నీటివిడుదల చేయడంతో కాలువలు, ఎత్తిపోతల పరిధిలోని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1060 అడుగుల (11.23టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్‌లోకి 289 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. కాకతీయకాలువకు 100 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 359 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వెళ్తున్నట్లు పేర్కొన్నారు.